21. తిరునవుక్కరసారు నాయనారు

శైవసమయాచార్యులు (మతగురువులు) నలువురిలో ఈయన ఒకరు. తిరునవుక్కదసారు నాయనారును అప్పార్, వాగీశనాయనారు అని గూడ పిలుస్తారు. జైనులు ధర్మసేనుడు అని పిలిచేవారు. తండ్రిపెట్టిన పేరు మరుల్‌నీకియారు.

ఈయన 7వ శతాబ్దమువాడు. తిరుమునైపాడునాడులో తిరువామూరులో పూకలనారు, మాతినియారు దంపతులకు తిలకవతి అని కుమార్తె, మరుల్‌నీకియారు అనే కుమారుడు జన్మించారు. మరుల్ నీకియారు అనగా చీకట్లను పారద్రోలేవాడు. లేక అజ్ఞానాన్ని అంతమొందించేవాడు అని అర్థముంది. చిన్న వయసుననే అన్ని శాస్త్రాలలో పరిణితి పొందాడు.

తిలకవతికి 12 సం॥ వయసురాగానే పల్లవ సేనాధిపతి అయిన కలైపహయారుకిచ్చి వివాహము చేయ నిశ్చయించారు. వివాహమునకు మునుపే అతను ఒక యుద్ధము చేయుచు మరణించాడు.

తండ్రి తీవ్ర రుగ్మతతో మరణించాడు. తల్లి మాతినియారు సతీసహగమనము జేసింది. పిల్లలు ఈ హృదయ విదారణ దారుణం నుండి తేరుకునేలోపల కలైపహయారు మరణవార్త చేరింది. వివాహానికి నిశ్చయ తాంబూలము పుచ్చుకోవటము జరిగినందున కలైపహయారును తన భర్త క్రిందనే పరిగణించి - తిలకవతిగూడ సహగమనము చేయదలచింది. మరుల్‌నీకియారు తిలకవతితో - నీవు ఇప్పుడు మాకందరికి తల్లివి. నీ సతి నిర్ణయం మార్చుకో. మనసు మార్చుకోనియెడల తాను గూడ చనిపోవుదునని బెదిరించాడు. తిలకవతి చేయునది లేక సతిని మానుకొన్నది. ఇంకా బాల్యావస్థ అయినా శివయోగినిగా శివధ్యానతత్పరతతో నుండుటకు నిశ్చయించుకొన్నది. ఆమె దివ్య జీవనాన్ని సేకిజార్ - తిరుమురాయిలలో మనోహరంగా పాడాడు. అప్పార్‌కు ఆమె తల్లిగా భాసించింది.

మరుల్‌నీకియారు వయస్సునకు చిన్నవాడైనా ప్రపంచ అనిత్యతను గ్రహించాడు. అన్ని దానధర్మకార్యాలలో నిమగ్నుడయ్యాడు. మతములలో మంచి మతమును అనుసరిద్దామను కొన్నాడు. జైనమతం గూర్చి చాలవిన్నాడు. జైనుల అహింసా సిద్ధాంతము నచ్చింది. తనకు జైనమతము ముక్తినీయగలదని భావించాడు. అందుకని జైనమతావలంబి అయ్యాడు. దక్షిణ ఆర్కాటు జిల్లాలోని పాటలీపుత్రం గూడ దర్శించి అచ్చటి జైనవిద్యాలయంలో చేరాడు. మత గ్రంధాలలో పాండిత్యము సంపాదించాడు.

సోదరుడు జైనమతం స్వీకరించడం తిలకావతి సహించలేక పోయింది. తన వూరు విడిచి తిరువడిగాయి విరాట్టనము మఠంలో చేరింది. విరాట్టనేశ్వరుని తన సోదరుని రక్షించుమని, అతనిపై ఈశ్వరకృప చూపమని బహుధా ప్రార్ధించింది. ఒకరోజున విరాట్టనేశ్వరుడు ఆమె కలలో కనుపించి "నన్ను గురించి మీ సోదరుడు చాల తీవ్ర తపస్సును ఈవరకే చేసియున్నాడు. తీవ్రవ్యాధికి గురిచేసి అతని మనసు తప్పక మార్చెదను. నా అనుయాయుడిగా చేసెదను"అని చెప్పాడు.

మారుల్ నీకియారుకి శూలవ్యాధి పొడసూపింది. బాధ భరించలేకపోయాడు. జైనులు ఆ వ్యాధిని కుదుర్చలేకపోయారు. ఈ వ్యాధి అతని మనోనేత్రంను తెరిపించింది. జైనమతం అంటే మమకారం పోయింది. తన సోదరి జ్ఞాపకానికి వచ్చింది. శ్రేష్టమైన మాహేశ్వర మతం విడిచి జైనమతమవలంబించుటచే - నాకీ బాధ కలిగింది కాబోలు ననుకున్నాడు. జైనదుస్తులు తీసివేసి ఎవరికి చెప్పకుండా తన సోదరి దగ్గరకు వెళ్లి ఆమె కాళ్లపై బడి తనను రక్షించమన్నాడు. ఆమె ఇది ఈశ్వరలీల అని గ్రహించింది.

ఆమె 'నీ వ్యాధి శివుని కృపచే నయమవుతుంది. దిగులుపడకు" అని పంచాక్షరిని జపిస్తూ అతని ఫాలంన మంత్రించిన విభూతినలమింది. అతని అజ్ఞానం సమసిపోయింది. విరాట్టనేశ్వరుని దేవాలయమునకు తీసికొని వెళ్లింది. అచ్చట ప్రదక్షిణ నమస్కారములు చేయించినది. మరుల్‌నీకియారు దేవుని అర్చించి ఒక కీర్తనపాడాడు. "మహాదేవా! నిన్ను, శైవమతాన్ని నిందించాను చాలా చెడ్డపనులు చేశాను. గోదావరి ఒడ్డున ఋషులతో వాదించాను. జైనమత ప్రాశస్త్యాన్ని గూర్చి ప్రచారం చేశాను. ఈ అపరాధ

ముచే యముడే ఈ యమ బాధరూపంలో నా వద్దకు వచ్చాడు. కరుణామయా! మీరే నాకు శరణ్యం. మీరే నా రక్షకులు, నన్ను రక్షించండి. మీ పాదకమలాన్ని సదా నాయెద ధరిస్తాను" అని పాట పాడాడు.

ఆ పాట అయిందో లేదో అతని వ్యాధి నిమ్మళించింది. ఒక దివ్యవాణి అన్నది "నీవు నా మహిమ నెఱిగి నన్ను తేవారములలో నుతించితివి. నీవు ఇప్పటి నుంచి "తిరు నవుక్కరసార్" (లార్డ్ ఆఫ్ స్పీచ్) వాగీశుడవని పిలువబడుతావు. అంతటా నీ మంచిపేరు వ్యాప్తి చెందుతుంది" అని వినిపించింది.

నాయనారు సంతోషానికి అవధులు లేకపోయాయి.

తిరునవుక్కరసార్‌కు వ్యాధి నిమ్మళించి శివునిమీద భక్తి అనురక్తి అనేక రెట్లు పెరి గింది. శివుని మహాభక్తులలో ఒకడయ్యాడు. పంచాక్షరీ మంత్రాన్ని నిరంతరం జపిస్తూ శివునిలోనే జీవించాడు.

నాయనారులోని ఈ మార్పు జైనులను భయపెట్టింది. జైనులు అతని వ్యాధిని కుదుర్చలేనందుకు, అందుకు ఆయన శైవమతము స్వీకరించి వ్యాధి కుదుర్చుకొన్నట్లును

రాజునకు తెలిసిన తమను రాజు శిక్షించునేమో అని తల్లడిల్లారు. ఈ బెడద తప్పించుకొ నుటకు వాళ్లు ఒక కథ అల్లారు. తిరునవుక్కరసార్ దేశద్రోహి. రాజుగారి యెడ, రాజుగారి జైనమతము యెడ ద్రోహము తలపెట్టినట్లు చిత్రించారు. రాజు వాళ్లని -నాయనారును వెంటనే తన ముందుకు తెమ్మన్నాడు. నాయనారుకు తనమీద జైనుల అభియోగం తెలి సింది. జైనులు తిరువతికాయి వద్దకు ఒకసేనతో వచ్చి, నాయనారుకు అభియోగం గూర్చి చెప్పి రాజుగారు తనని తీసికొని రమ్మని పంపిరని చెప్పారు.

నాయనారు - " మీ రాజు గారి ప్రజలలో నేను ఒకడిని కాను. నేను శివునికి చెం దిన వాడిని. అందరికి ఆయనే (శివుడే) రక్షకుడు. అన్ని దురితములను పోగొడుతాడు ఆ దేవదేవుడు. బ్రహ్మానందాది మోక్ష ప్రదాత. రాజుగారిని ధిక్కరిస్తే దేశద్రోహ నేరమవు నేమో కాని అది ఆయన దేశస్థులకు మాత్రమే పరిమితమవుతుంది.అంతేకాని నాకు

గాదు.నేను దేముని సంరక్షణలో నున్నాను. భయమనేది నా దరిదాపులకురాదు. నేను యముణ్ణే తన్నిన మహాశివుని భక్తుడను” అన్నాడు.

వచ్చినవారికి తిరునవుక్కరసారు గొప్పతనం తెలిసింది. కాని నాయనారు లేకుండా తిరిగి వెళ్లుటకు భయపడ్డారు. అందుకని నాయనారును తమతో రావలసిందిగా ప్రాధేయపడ్డారు. వారిమీద కరుణతో శైవమతం బలపర్చి శివుని గొప్పతనం చాటటం కోసం - వారితో నాయనారు వెళ్లాడు.

తిరునవుక్కరసును చూడగానే రాజు మండిపడ్డాడు. జైనులను ఈతనికి తగు శిక్ష విధించండి అన్నాడు. వాళ్లు అతణ్ణి సలసల కాగుతున్న సున్నం బట్టీలో వేయమన్నారు. ఆ ఆజ్ఞ ప్రకారం సున్నం బట్టీలో ఏడురోజులున్నాడు. నాయనారు మనసంతా శివునిమీద పెట్టి పంచాక్షరిని జపిస్తూ సమాధిలోకి జారాడు. నాయనారు చెక్కచెదరలేదు.

జైనులు - ‘లోగడ ఈతడు జైనుడు అప్పడు అతనికి అబ్బిన శక్తి ఇది’ అని ఓ విధమైన సమాధానం చెప్పి - అతనికి విషమిప్పించండి అని సలహా ఇచ్చారు.

ఆ విషయము నాయనారుకు అమృతమైంది.

ఇదిగూడ అతడు పూర్వము తమనుండి నేర్చుకొని ఉచ్ఛరించిన జైనమంత్రాల మహిమ అన్నారు. అందుకని నాయనారును ఏనుగులతో త్రొక్కించమన్నారు.

నాయనారు అమిత ప్రేమ దృక్కులు ఏనుగు సహజస్వభావాన్ని మార్చాయి. ఏనుగు నాయనారు చుట్టూ తిరిగి నాయనారుకు సాష్టాంగపడ్డది. ఏనుగును భయపెట్టారు.ఏనుగు మదమెక్కి మావంటి వాళ్లమీదకి వెళ్లి వాళ్లని, కొంతమంది జైనులను కూడ చంపి వేసింది. పారిపోయినవారు రాజుగారి కాళ్లపైబడి జరిగింది చెప్పారు. ఇది జైనులకు పెద్ద అవమానము.

రాజుగారు భంగపడ్డారు. జైనులు నాయనారుకు పెద్ద బండరాయిని కట్టి సముద్రములో పడవేయుడని ఆజ్ఞ ఇచ్చారు. రాజుగారి ఆజ్ఞ ప్రకారము బండరాయికి కట్టి నాయనారును సముద్రంలో కి తోశారు.

For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

నాయనారు ధ్యాస శివునిమీదనే వుండినది. పంచాక్షరీని జపిస్తూనే వున్నారు. పంచాక్షరి మహాత్మము గూర్చి పాడాడు. పాట అవగానే ఆశ్చర్యకరంగా ఆ బండరాయి నాయనారుతో సహా బెండులా తేలి అతనిని తిరుప్పపులియారు సముద్రపు ఒడ్డుకు సురక్షితంగా చేర్చింది.

తిరుప్పపులియారులో శివభక్తులందరూ నాయనారుకు ఘనస్వాగతం చెప్పారు. నాయనారు శివుని అర్చించాడు. శివుని మీద పాటలు పాడాడు. "మహాదేవా ! అదృశ్య రక్షకా ! అపద్బాంధవా ! మీరేనా మార్గము. మీరే నా రక్షకులు. మీరే నాతల్లి, తండ్రి, సోదరి అంతా మీరే! ఓ కృపామయా ! అన్ని విపత్తులనుండి కాపాడారు. మీ కృపమూలాన్నే నేనింకా జీవించి వున్నాను." "మనసా ! నీవు సంపూర్ణముగా శివుని అధీనంలో వున్నావు. ఇక ఆపదలన్న భయమెందులకు ? నిన్ను ఎవరును ఏమియు చేయజాలరు. భయపడకు" అని జాగృతము చేశాడు. శివుని దెస తిరిగి" కృపామయా ! ఇంక నాకు మరల పుట్టుకవద్దు. ఒక వేళ పూర్వ కర్మ విశేషముచే నేను తిరిగి పుట్టినయెడల మిమ్ములను ఆ జన్మలో మరిచిపోనీయ కండి. మీ నామము నే నాచే సదా ఉచ్ఛరింప జేయనీయండి మీ నామముచ్చరించుచు ఆనందాబ్ధిలో వుండనీయండి" అని మొర పెట్టుకున్నాడు.

తర్వాత త్రోవలో అన్ని దేవాలయాల్ని, పవిత్ర ప్రదేశాలను సందర్శిస్తూ తిరువాతికాయికి చేరాడు. ఇతనిని హింసింపచేసిన పల్లవరాజుకు తిరునవుక్కారుసు క్షేమంగా బ్రదికి వచ్చాడని తెలిసింది. ఇంత వరకు జరిగిన అద్భుతాలనన్నింటిని జ్ఞాపకం లోనికి తెచ్చుకున్నాడు. శైవమతాధిక్యతను గుర్తించాడు. తిరువాతికాయికి వెళ్లి తిరునవుక్కారసు పాదాలపైబడి తన తప్పిదమును క్షమించమని కోరాడు. పరమాదరంతో, వాత్సల్యంతో తిరునవుక్కారసు రాజుగారిని పరిష్వంగనం చేసికొన్నాడు. రాజుగారు శైవమతమవలంబించి తిరువత్తి కాయిలో శివునకు మహావైభవోపేతమయిన 'గుణభారవీచురము' అను దేవాలయమును నిర్మించాడు.

నాయనారు శివునికి అనేక రకములయిన అర్చనలు గావించాడు. అందరు

మునులకు ఒక వరవడి చూపాడు. వారి నిరంతర ధ్యానము ఆగ కూడదు. వారు జాగరూకులై యుండాలి. లేని యెడల మాయ వారిని కప్పగలదు. అందుకని వారు నీతి మంతముగ నమ్రతతో ఒదిగి జీవించాలి. అందరకు వారు మార్గదర్శకులవ్వాలి అని చెప్పాడు.

చాల తీర్థములను సేవించాడు. అన్నిచోట్ల శివప్రాశస్త్యాన్ని వెల్లడిచేశాడు.

'తిరుత్తూంగానై మావడము' అను క్షేత్రమున కొలది కాలము జైనుల సాంగత్య ములో వున్నందులకు, వారితో భుజించినందుకు తన శరీరంలో అపవిత్రత ఇంకను వున్నదని ఈ అపవిత్రతతో శివార్చన కొన సాగించుట యుక్తము కాదని భావించి శివుని పరమశివా ! ఈ అపవిత్ర శరీరముతో నేను జీవించియుండుట కిచ్ఛగించను. కావున త్రిశూల వృషభాంకములను నాభుజములందుంచండి. అప్పడు నేను పవిత్రుడనైనట్లు, మీ గూర్చి పూజకు అర్హుడ నని భావిస్తాను అని మొరపెట్టుకున్నాడు. పరమశివుడు అతని భక్తి జ్ఞాన వైరాగ్యములకు మెచ్చి ప్రమథులలో నగ్రేసరుని పంపి అతని కోరిక నెరవేర్చుము అని నియమించెను. అతడు నాయనారు భుజములపై త్రిశూలము, నంది గుర్తులను వేశాడు. నాయనారు పరమానంద భరితు డయ్యాడు. తాను పవిత్రుడనైనట్లుగా భావించాడు.

అక్కడనుండి నాయనారు తిరువరత్తుర, కనకసభమున్నగు స్థలములకు పోయి చిదంబరము చేరుకొన్నాడు.

చిదంబరంలో నటరాజస్వామి దేవాలయంచూడగానే సమాధిస్థితిలోకి జారుకున్నాడు. తేరుకొని ఆనందోత్సాహముతో దేవునిపై పాటలు పాడాడు. మళ్లీ మహాదేవా ! మీకు సేవను జేయనీయండి. మీ భక్తులకు లేమి, కొరత, భయాలు వుండవు. యముడు కూడ శివభక్తులను సమీపించుటకు భయపడతాడు. మీ స్థానానికి వచ్చాను. ఇక్కడ పాపమనేది దగ్గరకు రాదు. నేను మిమ్ములను పూర్తిగా శరణు జొచ్చాను. మీ చరణ కమలములను నా హృదయంలో పదిలపరచాను అని ప్రార్థించాడు.

అచ్చట తిరుజ్ఞాన సంబంధారు విశేషాల్ని విన్నాడు. పార్వతీదేవి ఆయనకు చూపిన కృప, అనుగ్రహాన్ని తెలిసికొన్నాడు. షియాలి లోవున్న అమహనీయుణ్ణి దర్శించాలని బయ లుదేరాడు. నాయనారు షియాలి వచ్చుచుండుట విని సంబంధారు గూడ తిరునవుక్క రుసును చూడ గాఢముగా తలచి తనూ ఎదురు వెళ్లాడు. షియాలి పొలిమేరకు నాయ నారు ఎదురు వస్తున్న సంబంధారుకు సాష్టాంగ పడ్డాడు. రెండు చేతులతోను అరుసు నెత్తి నమస్కరిస్తూ సంబంధారు నాయనారును అప్పారే (తండ్రీ) అని పిలిచాడు. అరసు సంబంధారునుద్దేశిస్తూ, మీ సేవకుణ్ణి అన్నాడు.

నటరాజస్వామి దేవాలయానికి అప్పారు సంబంధరులు ఇద్దరు వెళ్లి నటరాజ స్వామి నర్చించారు. సంబంధారు కోరికపై తిరునవుక్కరసారు శివునిపై పాట పాడాడు. “ప్రళయంలో ప్రపంచం మునిగి యుండినపుడు తోలియప్పారు దైవము తన సతి పార్వతితో పక్షులరూపంలో దేవత లందరు పర్యవేక్షించి యుండ, ప్రణవమనే నావలో (స్వామి) ఆసీనులై యున్నారు” అని పాడాడు.

ఈ రోజుకి తోనియప్పారు దేవుడు నావలోనే వున్నట్లుగా చూస్తాము.

నాయనారుసంబంధారు కలిసి తిరుక్కోలక దేవాలయాన్ని సందర్శించారు. అచ్చట సంబంధారుకు వీడ్కోలు పలికి - సంచారముసాగిస్తూ అనేకదేవాలయాల్ని సంద ర్శిస్తూ నాయనారు తిరువావదూతురై చేరుకున్నాడు. అక్కడ తీవ్ర వైరాగ్యంతో మహాదేవా జననమరణ వలయం లో చిక్కియున్నాను. నాకు బ్రదుకుమీద ఇచ్ఛలేదు. దీనినుండి బయట పడేత్రోవ చూపండి స్వామీ అని పాడాడు.

సత్తిమూలము చేరుకున్నాడు. అక్కడ దేవుని ఉద్దేశించి మహాదేవా ! నేను ఈ శరీరం త్యజించు లోపల మీ పాద కమలములు నాశిరసుపై నుంచండి స్వామీ ! అని ప్రార్థించాడు. మహాదేవుడు తిరునల్లూరుకు రమ్ము అచ్చట నీకోరిక తీరును అన్నాడు.

దానిమీదట నాయనారు తిరునల్లూరుకు చేరుకున్నాడు. అక్కడ దేవుని అర్చిం చాడు. అప్పారుతలపై పరమశివుడు పాదాలని వుంచాడు అప్పారు “మహాదేవా! మీ పాద కమలములను ఇచ్చట జ్ఞానులు, దేవతలు గూడ అర్చిస్తారు. మహాతపస్వినులు కూడ

వారి ఆర్తిలో ఏ కొరతవున్నా, నీ పాదకమలములు తాకలేరు. కాని నిజమైన భక్తుల కు నీవు సులభుడవు. నీ చరణములు లభ్యమవుతాయి. పామరులకు నీపాద కమల ముల మహిమ అర్థంకాదు. మీ దివ్యచరణములు సకల సంపదలనిస్తాయి. పరమా నందాన్ని కలిగిస్తాయి" అని పాడాడు.

మరికొన్ని దేవాలయాలను సందర్శించి తింగలూరు చేరి అచ్చట దేవుని మహిమ చూపాడు. తాగళూరు (తింగలూరు) లో అప్పూడి యడిగళ్‌నాయనారు (25) అనుమ హాత్ముడు ఉన్నాడు. అతడు (తిరునవుక్కరసు వాగీశుడు) వాగీశుని యందున్న భక్తి వలన కుమారులకు అందరకును వాగీశులు అని పేర్లు పెట్టినాడు. అతడు త్రవ్వించిన నూతులకు, వేయించిన తోటలకు, నిర్మించిన తటాకములకు ఇంకను అటువంటి ధర్మ కార్యములన్నిటికిని వాగీశుని ధర్మము అని వ్రాయించాడు. ఆ అప్పడి యడిగళ నాయనా రును తన ఇంటికి విందునకు ఆహ్వానించాడు. కుమారులలో పెద్దవానిని పెద్దవాగీశుని తోటకుపోయి ఆకులను కోసుకురమ్మని పంపాడు. అతడు ఆకులను కోయుచుండగా పాము అతనిని కరిచింది. అతడు ఆకులను తల్లిదండ్రులకిచ్చి వారికి పాముకాటు సంగ తి చెప్పి మరణించాడు. ఆ దంపతులు దీనిని రహస్యముగా నుంచి అప్పారును భోజన మునకు లెమ్మని పిలిచారు. వాగీశుడు దివ్యదృష్టివలన జరిగినది గ్రహించి శవమును దేవాలయం ముందరకు గొని రండని ఆదేశించాడు. ఆ పిల్లవానిని బ్రదికించమని వృత్త జాలముతో పరమశివుని ప్రార్థించాడు. బాలునకు ప్రాణము వచ్చి నిదురనుండి లేచినట్లు లేచి కూర్చున్నాడు. అచ్చట విందారగించి వాగీశుడు అనేక ఆలయాల్ని సందర్శిస్తూ తిరు వారూరు కు చేరుకున్నాడు. (అచ్చట మునుపు నమినంది యడిగల్ నాయనారు (27) నీటితో దేవాలయంలో దీపాలు వెలిగించాడు. అచ్చట వాగీశుడు అతని ప్రభావమును వృత్తజాలముతో వినుతించాడు.)

తిరువావూరులో శివభక్తులు అప్పారుకు ఘనస్వాగతం పల్కారు. అక్కడి పరమ శివుడు అప్పారుకు దర్శనమిచ్చాడు. దేవుని మీద ప్రేమ నాయనారులో పెల్లుబికింది.

ఆనందభాష్పాలు రాలుస్తూ ఆనందంతో నృత్యము చేశాడు. పాటలు పాడాడు. ఒక పాటలో జైనమతం పుచ్చుకొని ఎంత తప్పిదం చేశాను ? నేను శివభక్తుడుగా ఆర్తితో ఆయనసేవ లో కొనసాగినచో ఈ వరకే నాకు శివదర్శనమయ్యేడిది గదా అని వాపోయాడు. ఇంకో గీతంలో నమినంది అడిగల్ (27) దీపారాధనకు నూనె ఎచ్చటను దొరకక పోగా దేవాల యంలో దీపాలను నీటితో వెలిగించిన విశేషణ ఆయన పరాభక్తిని గూర్చి కొనియా డాడు.

తర్వాత త్రోవలో దేవాలయాలు చూచుకుంటూ తిరుపూకలూరు చేరాడు. అక్కడ కు తిరుజ్ఞాన సంబంధారు వచ్చియున్నాడు. ఇద్దరు మహాభక్తులు రెండవసారి కలుసుకు న్నారు. అప్పారు కోరికపై సంబంధారు తిరువావూరు వెళ్లి అచ్చటి దైవాన్ని సందర్శించాడు. తిరుపూకలూరు లో ఇద్దరు కొంతకాలమున్నారు. చాలమంది భక్తులకు ఈ ఇద్దరి సమ యాచార్యులను ఒకేచోట దర్శించటానికి వీలయింది. తిరునీలకంఠనాయనారు, శిరు తొండారు, మురుగ నాయనారు ఇంకా చాలమంది తిరుపూకలూరు వచ్చారు. ఆ స్థాన ము మహా శివస్థానముగా రూపొందింది.

ఈ ఇద్దరు భక్తులు తర్వాత తిరునీజిమలై సందర్శించారు. అక్కడ అప్పుడు క్షామ ము (కఱువు) విజృంభించింది. అప్పారు సంబంధారులకు చాల బాధకలిగింది. ప్రజల ఆర్తిని భరించలేకపోయారు. ఆ ఇద్దరు దేవునిగూర్చి ఈ జనులవ్యధ తీర్చమని ప్రార్థిం చారు. పరమశివుడు ఇద్దరికి చెరిఒక సువర్ణనాణాన్ని ప్రతిరోజు ఇస్తానని దానితో ప్రజల వ్యథ తీర్చమని ఆదేశించాడు. శివుడు రెండు నాణాల్నుంచాడు. ఒక నాణాన్ని పశ్చిమ ద్వారము బలిపీఠముమీదను, రెండవ నాణాన్ని తూర్పు ద్వారపు బలిపీఠము మీదను ఉంచాడు. నాయనార్లు ఈ రెండు నాణెములను తీసికొని ప్రజల ఆకలి తీర్చారు. కరువు గూడ అంతమయింది.

ఈశ్వర కృపను ఈ ఇద్దరూ ప్రశంసిస్తూ ఆ ప్రదేశమును వీడారు.

ఇప్పటి వేదారణ్యమయిన తిరుమలైకాడుకు ఈ ఇద్దరు భక్తులు చేరుకున్నారు. ఇచ్చట పూర్వము వేదాలు దేవుని కొలిచేవట. ప్రజలు వేదములు చదువుట మానగానే

వేదాలు గూడ తమకొలువు మానివేసినవట. అప్పటి నుంచి వేదాల ప్రవేశద్వారము మూతబడింది. ఇంకోద్వారమునుండి భక్తులు దేవాలయ ప్రవేశమొనరించుచున్నారు. సంబంధారు మూతబడిన (మూసిన) ద్వారము గుండా లోనికి వెళ్లాలనుకున్నాడు. అప్పారును దీనినిగూర్చి దేవునిమీద పాడమన్నాడు. అప్పారు పాట పూర్తికాగానే ఆ ద్వారపు తలుపులు అవంతట అవే తెరచుకున్నాయి. లోనికి ఇద్దరు వెళ్లి శివుని అర్చించారు. ఆ ప్రవేశద్వారంద్వారా ఇద్దరూ వెలుపలికి వచ్చిన తర్వాత అప్పారు ఈతూరి సంబంధారును పాడమన్నాడు. సంబంధారు వృత్తజాలంతో నుతించగానే ఆ ద్వారము మూసుకు పోయింది.

ఒకరోజు రాత్రి శివుడు అప్పారు కలలోకనిపించి తిరువాయిమూరుకు రమ్మన్నాడు. అక్కడ శివుడు కనిపించి అప్పారు ముందర నడవటం మొదలు పెట్టాడు. అప్పారు శివుని అనుసరించాడుగాని, శివుని దగ్గరకు వెళ్ళలేకపోయాడు. అకస్మాత్తుగా శివుడు ఆ ప్రదేశంలోవున్న ఒక దేవాలయంలో ప్రవేశించి అంతర్థాన మయ్యాడు. అప్పారులోనికి వెళ్లాడు. కాని శివుడు కన్పడలేదు. ఈ లోగా సంబంధార్ అప్పారు వెళ్ళుచుండుట చూచి అతనిని అనుసరించి ఆ గుడి దగ్గరకువచ్చాడు. అప్పారు సంబంధారుకు తన దర్శనమిచ్చి అనుగ్రహించమని శివుని ప్రార్థించాడు. అప్పారు కోరికను శివుడు మన్నించాడు. ఇద్దరు అచ్చట నుంచి తిరువాయిమూరు వెళ్లి అక్కడనుంచి తిరుమరై కాడకు (వేదారణ్యంకు) తిరిగి వచ్చారు.

పాండ్యభూపతి దేవేరి రాణి మంగయార్ కారసియారున్ను, మంత్రి కులాచిరాయి నాయనారున్ను మధురనుండి సంబంధారుకు జైనుల దుష్కృత్యాలు తెలుపుతూ వార్తల నంపారు. వారిని మధురవచ్చి జైన ప్రాబల్యం తగ్గించ వినతిని పంపారు. సంబంధారు వెంటనే మధుర వెళ్లాలనుకున్నాడు. అప్పారు తన జైనచరిత్ర చెబుతూ అక్కడకు వెళ్లవద్దన్నాడు. సంబంధారు మనసు ఆగలేదు. మధుర వెళ్లాడు. (నాయనార్లు 49, 50 చరిత్రలో చూస్తాము). వెళ్లి మధురరాణి మంత్రులకు జైనుల బెడదను తొలగించి శైవమత వ్యాప్తికి దోహదం చేశాడు.

అప్పారు తర్వాత తిరువావదూతురాయి సందర్శించి అనంతరం పజ్హైయరాయి కువచ్చాడు. ఇక్కడ వడతలాయి దేవళమును సందర్శించి బయటనుండే దేవుని అర్చన చేశాడు. ఇది శివాలయము. జైనులు దీనిని జైనదేవాలయము క్రింద మార్చారని, శివలింగమును అచటనుండి తీసి ఎవరికి తెలియని చోట పెట్టారని తెలిసింది. అప్పారు శివుని ప్రార్థించాడు. “మీ లింగము ఎచట దాచబడినదో తెలియుదుకనుక, ఆ లింగదర్శనము చేయుదాక ఇచ్చటనుండి ఒక అంగుళము కూడ కదలను అని భీష్మించి కూర్చున్నాడు. శివుడు రాజు కలలో కనబడి, “ఓ రాజా ! నా భక్తుడు, నాదర్శనంకొరకు నిరాహార దీక్ష లోవున్నాడు. వెంటనే వెళ్లి అక్కడనున్న జైనులను తరిమివేసి నా భక్తుని గుడిలోనికి వెళ్లునట్లు చేయి. నా దర్శనమునకు వీలుకల్పించు అని ఆదేశించాడు. ఆ లింగమెచట దాచబడినదో గూడ రాజునకు శివుడు చెప్పాడు.

రాజు వెంటనే నిదురనుండి లేచి మంత్రులను పిలిచి గుడికి వెళ్లి జైనులను తరిమివేసి తిరునవుక్కరసు పాదాలపై బడ్డాడు. వెంటనే జైనదేవాలయమును శివాలయముగా మార్చివైచాడు. శివలింగాన్ని యధాస్థానాన నిలబెట్టారు. తిరునవుక్కరసు శివుని అర్చించి ధన్యుడునైతినని ఆనందభాష్పాలు రాల్చాడు.

ఇంకో తీర్థయాత్రలో తిరుపెయిన్‌జీలి సమీపిస్తుండగా అప్పారుకు ఆకలి వేసింది. పరమశివునికి అతని ఆకలి దప్పికలను తీర్చాలనిపించింది. త్రోవలో ఒక తోటను, చెరువును సృష్టించాడు. అప్పార్ దప్పికను తీర్చుకొని కొంచెం సేపు తోటలో విశ్రమించాడు. శివుడు ఒక బ్రాహ్మణ వేషంలో చేతిలో ఆహారపదార్థాలను పట్టుకొని అప్పారు కొరకే వేచియున్నాడు. అప్పారు రాగానే అప్పారుకు ఆహారపదార్థాలనిచ్చాడు. అప్పారు భుజించి, మంచి నీళ్లు త్రాగి, సేద దీర్చుకొని బ్రాహ్మణుని మీరెక్కడకు వెళ్తున్నారని ప్రశ్నించాడు. నేను తిరుపెయిన్ జీలి వెళ్తున్నాను అని బ్రాహ్మణుడు చెప్పాడు. ఇద్దరూ నడుచుట మొదలుపెట్టారు. ఆవూరు సమీపిస్తుండగా బ్రాహ్మణుడు ఆకస్మాత్తుగా మాయమయ్యాడు. అప్పారు ఆవచ్చినది పరమశివుడే అని గ్రహించాడు. పరమశివుని గుర్తించలేక పోయినందుకు దుఃఖము ముంచుకువచ్చింది. శివునికి దూరమైనందుకు ఏడుస్తూ నేలపై దొర్లాడు.

తిరువన్నామలై 'కంచి దర్శించాడు కాళహస్తిలో కన్నప్పార్ గూర్చిపాడాడు. ఇవి దర్శించిన తర్వాత అప్పారుకు ఇక కైలాసానికి వెళ్లాలని మనసైంది. కాశి వెళ్లి విశ్వనాధు ని అర్చించాడు. ఉత్తర దెసతిరిగి అనేక క్రూర మృగ దుర్గమారణ్యాలను దాటి వెళ్లాడు. క్రూరమృగములపై అతని దృష్టిపడగానే అవన్నీ సాధుజంతువులై పోయేవి. రాత్రింబగళ్లు నడిచాడు. కాళ్లు పుళ్లుబడ్డాయి. చేతులతో ప్రాకడం ప్రారంభించాడు. మోకాళ్లు , మోచే తులు అరిగి నెత్తురు కారటం ప్రారంభించింది. ఎముకలు విరిగాయి. అయినా కైలాస యాత్రమనోనిబ్బరంతో సాగించాడు. అప్పార్ కైలాసానికి చేరాలనుకున్నాడు. కాని శివుడు అతను ఇంకనుకొంత కాలం భూమిమీదనే ఉండాలనుకున్నాడు. తనమీద అప్పారుకీర్తన లను వినాలను కున్నాడు. అందుకని అచట ఒక చెరువును సృష్టించి ఒక జడలు కట్టిన మునిలాగ మెడలో రుద్రాక్షలతో, విభూతి పుండ్రములతో అప్పారు ముందర ప్రత్యక్షమ య్యాడు. అప్పారు కైలాసానికి వెళ్తున్నట్లుగా తెలిసి కొన్నాడు. ఆముని అన్నాడు ఓ స్నేహితు డా కైలాసం మానవమాత్రులకు కనిపించదు. అందుకని వెనుదిరిగిపో అన్నాడు.

అప్పారు ఈ శరీరమున్నంత కాలము కైలాసానికి వెళ్లాలనే కోరిక మానుకోను అని తిరిగి మునికి నమస్కరించాడు. అచ్చట ఆముని కన్పడలేదు. అప్పారుకు మళ్లీ అర్థమైం ది. ఆ వచ్చింది ఎవరో కాదు పరమశివుడేనని. ఆ క్షణం నుంచి అప్పారుకు కనబడకుం డా శివుడు అతనిని అనుసరించాడు. అప్పుడప్పుడు ఉత్సాహ పూరితంగా వరాట్లాదేవాడు. అప్పారు మనసులో శివుని పరమశివా ! నా ప్రయాణము కొనసాగించుటకు నాకు నూతన శరీరము ఇవ్వుము! అని ప్రార్థించాడు. శివుడు దగ్గరనున్న చెరువులో స్నానము చేసి రమ్ము అని ఇలా చెప్పాడు. నువ్వు నానివాసమైన కైలాసాన్ని తిరువైయారు చూస్తా వు అన్నాడు.

అప్పారు పంచాక్షరిని జపిస్తూ ఆ చెరువులో మునిగాడు మునిగిలేవగానే ఎక్కడో దక్షిణాదిన వందలమైళ్ల దూరములో నున్న తిరువయార్ సరస్సులో తానున్నట్లు గా గమ నించాడు.చెరువునుంచి బయటకు వచ్చి అంతటా శివశక్తి స్వరూపములనే చూచాడు. గుళ్లోకి వెళ్లాడు. అచ్చట కైలాస పర్వతాన్ని చూచాడు. అచ్చట శివుడు అంబ పార్వతి

వుండగా దేవతలు ప్రమథగణాలు ఆయనను స్తుతిస్తున్నట్లు చూచాడు. అప్పారు తన్మయత్వము నొంది దేవుని నుతిస్తూ నృత్యము చేశాడు.

తిరువూనుతురాయిలో అప్పారు వుండుటకు ఒక మఠం నిర్మించ బడ్డది. సంబంధారు జైనులను మధురలో ఓడించి తిరుపూను తురాయికి తిరిగి వస్తున్నాడు. అప్పారు ఆయనకు స్వాగతమిచ్చుటకు వెళ్లాడు. సంబంధారును పల్లకిలో మోసుకొని వస్తున్నారు. సంబంధారుకు తెలియ నీయకుండా అప్పారు ఆ పల్లకి ఒక కొమ్మును తన భుజాలపై నుంచుకొని మోసాడు. తిరుపూనం తురాయి చేరగానే అప్పార్ ఎక్కడ అని ప్రశ్నించాడు. నేనిక్కడనే వున్నాను స్వామి అన్నాడు సంబంధారుపల్లకి నుండిదిగి అప్పారు కాళ్లమీద పడ్డాడు. అప్పారు చూపిన నమ్రతకు సంబంధారు చలించి పోయాడు. ఇద్దరు ఒకరి నొకరు పరిష్వంగనం చేసికొన్నారు.

తిరునవుక్కరసారు పాండ్యదేశంలో శైవమతం ఎలావుందో స్వయంగా చూద్దామనుకొని మధుర వెళ్లాడు. రాజు నిన్రాషీర్ నెడుమారనాయనారు (49, 50) రాణి మంగయార్కార శియారు, మంత్రి కులాచిరాయినాయనారు (22) అత్యంత ఆదరంతో అప్పారుకు స్వాగతం చెప్పారు. అప్పారు దేవుని అర్చిస్తూ అక్కడ కొన్నాళ్లున్నాడు. అచ్చటనుంచి రామేశ్వరము, ఇతర ప్రదేశాలకు వెళ్లి తిరుపూకలూరుకు చేరుకున్నాడు.

అక్కడ శివుడు అప్పారును పరీక్షించదలచాడు. దేవాలయంలో అప్పారు సేవ చేస్తున్నప్పుడు ఆ ప్రదేశమంతా బంగారము, రత్నాలతో నిండి యున్నట్లనిపించింది. అప్పారుకు బంగారము, రత్నాలు గడ్డి పరికతో సమానము. అప్పారు అక్కడ నున్న బంగారము, రత్నాలనేరి ప్రక్కనున్న చెరువులో పడవేశాడు. శివుడు ఈసారి అందమైన భామల్ని అక్కడనుంచాడు. వారిని అప్పారుచూచాడు చలించలేదు. తన ధ్యాస అంతా శివుని పైనే నిలిచి వుంది.

అప్పారు అక్కడ కొంతకాలముండి తన 81 సంవత్సరము వయసులో శివైక్యము చెందాడు.